# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-05-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ మధ్యాహ్నం రాష్ట్రానికి రానున్నారు.**

**2.** **రాష్ట్రానికి రానున్న ప్రధానమంత్రికి మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు.**

**3.** **వేవ్స్ సదస్సులో ఈరోజు నిర్వహిస్తున్న గ్లోబల్ మీడియా డైలాగ్ కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పాల్గొన్నారు.**

**4.** **ఆయుష్ రంగంలో వైద్య పర్యాటకానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు.**

**5.** **రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి 400 కోట్ల రుపాయలు కేటాయించామని మంత్రి బిసి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ మధ్యాహ్నం రాష్ట్రానికి రానున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో 58 వేల కోట్ల రూపాయలతో చేపట్టే రోడ్డు, రైల్వే ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారు. దీని పై మరిన్ని వివరాలను మా ఆకాశవాణి ప్రతినిధి అందజేస్తారు.

..వాయిస్.. 40 సెకన్లు

కాగా ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యక్ష వ్యాఖ్యానం ఆకాశవాణి అందించనుంది. ఎఫ్ఎం గోల్డ్, ఇంద్రప్రస్థ, న్యూస్ ఆన్ ఎయిర్ యాప్, ఆకాశవాణి యూట్యూబ్ ఛానెల్స్ లో ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని వినవచ్చు.

--------------------------

అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవానికి రాబోతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈమేరకు వారు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. రాష్ట్ర ప్రజల

కల రాజధాని నిర్మాణాన్ని సాకారం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిదని చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించే ప్రజా రాజధానిగా అమరావతి ఆవిష్కృతం అవుతుందని.. సంపద సృష్టితో రాష్ట్రానికి ఒక చోదక శక్తిగా నిలబడుతుందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

కాగా.. రాజధాని గ్రామాల రైతులు ప్రధానమంత్రి పర్యటనను స్వాగతిస్తూ ర్యాలీ నిర్వహించారు.

---------------------------

వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ వేవ్స్ సదస్సు ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతుంది. వేవ్స్ సదస్సులో 2వ రోజైన ఈరోజు గ్లోబల్ మీడియా డైలాగ్ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి ఎల్ మురుగన్ పాల్గొన్నారు.

అలాగే వేవ్–ఎక్స్, భారత్ పెవిలియన్, ఎగ్జిబిషన్ పెవిలియన్, వేవ్స్ బజార్ క్రియేటివ్ ఇండియా చాలెంజ్ అవార్డుల కార్యక్రమాలు జరుగుతాయి. అలాగే కల్చరల్స్ కాన్సర్ట్స్ విభాగంలో భాంగ్రా, జాత్రో,సంబల్‌పురి, చౌ, మణిపురి వంటి భారతీయ సాంప్రదాయ ప్రదర్శనలు జరుగుతాయి. గాయకులు శంకర్ మహదేవన్ చలనచిత్ర గీతాలు ప్రదర్శన నిర్వహించనున్నారు.క్రియేటోస్పియర్, వేవెక్స్ పై మాస్టర్ క్లాసులు జరుగుతున్నాయి.అలాగే సినిమా : ది సాఫ్ట్ వేర్ అంశంపై నిర్వహించే చర్చా కార్యక్రమంలో భారతీయ హిందీ చలన చిత్ర పరిశ్రమకు చెందిన కరీనాకపూర్, తెలుగు నటులు విజయ్‌దేవర కొండ పాల్గొంటారు.

---------------------------

ఆయుష్ రంగంలో వైద్య పర్యాటకానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని వైద్యారోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ తెలిపారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ మహారాష్ట్రలోని లోనావాల వద్ద ఏర్పాటు చేసిన సదస్సులో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయుష్ వైద్య సేవల రంగంలో ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో అందిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భారతీయ అల్లోపతి వైద్య విధానాలతో సమీకృత ఆసుపత్రుల ఏర్పాటు వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆసుపత్రులను స్థాపించడానికి పెట్టుబడుల సమీకరణలు వైద్య పర్యాటక అభివృద్ధి పై దృష్టి సారిస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి 400 కోట్ల రుపాయలు కేటాయించామని రహదారులు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా గ్రామీణ రహదారుల అభివృద్ధి నిధి –ఆర్ఐడిఎఫ్ ద్వారా 192 పనులను చేపట్టి ఒక వెయ్యి 245 కిలోమీటర్ల మేర జిల్లా ప్రధాన రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. రానున్న 5 సంవత్సరాల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రహదారులను మరింత మెరుగ్గా అభివృద్ధి చేయడంతో పాటు, రహదారులకు పూర్వ వైభవం తిరిగి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు.

---------------------------

రాష్ట్రంలో గ్రూప్–1 2023 ప్రధాన పరీక్షలను రేపటి నుంచి నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ –ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రాజబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురంలోని 13 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 4 వేల 496 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరవుతారని, రేపటి నుంచి మే 9వ తేదీ వరకు ప్రధాన పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటాయని, పరీక్షల నిర్వహణను నాలుగు జిల్లాల కలెక్టర్లు పర్యవేక్షిస్తారని ఏపీపీఎస్సీ కార్యదర్శి వివరించారు.

---------------------------

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం మహిళల ఆర్థిక సాధికారతకు దోహదపడుతోంది. తిరుపతి జిల్లాలో ఈ పథకం విజయవంతంగా అమలవుతోంది. విశ్వకర్మ పథకం కింద తిరుపతి జిల్లా వ్యాప్తంగా 6 వేల 926 మంది ఉచిత టైలరింగ్ శిక్షణకు ధరఖాస్తు చేసుకోగా విడతల వారీగా మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టుమిషన్లను కూడా ప్రభుత్వం అందజేస్తోంది. ఉచిత శిక్షణ ఇవ్వడంతో కుట్టుమిషన్లను అందించంతో మహిళలు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని విశ్వకర్మ పథకం శిక్షకురాలు సంధ్య తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఈనెల 5 నుంచి 8 వరకు, తిరిగి 12 నుంచి 15 వరకు రెండు దశల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 6 ఏళ్లలోపు చిన్నారుల కోసం ప్రత్యేకంగా వీటిని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. చిన్నారుల జనన ధ్రువీకరణ పత్రాలను తల్లిదండ్రులు ప్రత్యేక శిబిరాల్లో చూపించి ఆధార్ నమోదు చేయించాలని సూచించారు. ఆధార్ ఇప్పటికే నమోదు చేయించుకున్నవారు గ్రామ, వార్డు సచివాలయాల్లోని రికార్డుల్లో నమోదు చేయించుకోవాలని అధికారులు సూచించారు.

---------------------------

పురాతన కట్టడాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని రాష్ట్ర పురావస్తు శాఖ సహాయ సంచాలకులు రజిత అన్నారు. అనంతపురంలోని పురావస్తు శాఖ కార్యాలయంలో ఆమె ఈరోజు మాట్లాడుతూ, చిన్ననాటి నుండే పిల్లలకు పురావస్తు ప్రదర్శన శాలలను చూపించాలని అన్నారు. అనంతపురంలో వున్న కల్లూరు సుబ్బారావు పురావస్తు ప్రదర్శన శాలలో ఎన్నో ప్రాచీన వస్తువులు ఉన్నాయని ప్రజలు సందర్శించాలని ఆమె కోరుతూ..

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిశిఖర గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టిసారించాలన్నారు. వసతి గృహాల్లో సౌచాలాయలను పెంచాలని సూచించారు. డోలీల రహిత గ్రామాలు ప్రభుత్వ లక్ష్యమని, దీనికి అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు.

=====================